పొందడం, పోగొట్టుకోవడం, స్మృతులు లేని జీవనం ఇతని విషాదం.
అనుభవం, అనుభూతులు లేని ఒక పీటముడి బంధం.
కోరుకోవడం, కోరుకున్నది పొందడం మిగిల్చే సంతృప్తి అతనికి చాలు.
మంచి కాఫీ తాగితే అయిపోతుందని భయం.

తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

# 10 మార్కండేయుడి కాఫీ

చారి పి.ఎస్.





మార్కండేయులి నల్లగడ్డం దరిదాపు ఎండిపోయింది. నేను అతన్ని క్రితంసారి చూసినప్పుడు, అంటే మూడు నాలుగు నెలల క్రితం అంతగా ఎండలేదు. కానీ మనిషి మాత్రం అప్పటికే ఎండిపోయాడు. అతనితో నిమిత్తం లేని కోరిక, లేదా అవసరం ఏదో మార్కండేయుణ్ణి నడిపిస్తుందనుకుంటాను. ఎందుకంటే అతను మామూలుగా జీవించడానికి అవసరమైనవి ఏవీ చేయడు. మార్కండేయుడు చేసే ఉద్యోగం సైతం ఉదయం నుంచీ సాయంత్రం వరకూ వీపుకు అతుక్కున్న ముక్కలా ఉంటుంది. స్విచ్చిబోర్డులో పెట్టిన ప్లగ్గులాగా అదే అతనిచేత పని చేయిస్తూంటుంది. అప్పుడు కూడా ఎప్పటిలాగే నవయుగ హోటలు రెండో అంతస్తులో కిటికీ పక్కనే కూచున్నాం. నవయుగ ఇడ్లీలు, పల్లీ పచ్చడీ దేవతలు చేసినట్టుంటాయి, కాఫీతో సహా. దాన్నే అమృతం అంటారేమో నాకు తెలీదు. ఇడ్లీ అవగానే సర్వరు రెండు కాఫీ మా ముందు పెట్టాడు. ఎప్పటిలాగే మార్కండేయులు- అంటే అప్పటికి మూడునెలల క్రితంలాగ కాఫీ కప్పు వేపు చూస్తూండిపోయాడు.

"తీసుకో."

మార్కండేయులు కాఫీ వేపు చూస్తూ, "అయిపోతుంది," అన్నాడు.

"మళ్లీ తాగు."

"కాఫీ తోటలకి పోదావనిపిస్తోంది."

నవ్వేను. మార్కండేయులు జాగ్రత్తగా కాఫీ కప్పు తీసుకొని, ఒకసారి చూసుకుని, మరో పెదాల జత మీద ఆనించినట్టు నోటి దగ్గర పెట్టుకున్నాడు.

"ఈ జ్ఞాపకాలనేవి చచ్చిపోతే ఉండవుగా?" అన్నాడతను.

"జ్ఞాపకాలేవిటి, ఏదీ ఉండదు. ఇతరులకి మన జ్ఞాపకాలు తప్ప."

“అవును, అందుకే చచ్చిపోవడం మానుకున్నాను నేను. మర్చిపోలేకుండా ఉన్నాను. వెనకనుంచి బతుక్కుంటూ వస్తున్నాను.”

“జ్ఞాపకాలంటే కొంత దూరం ముందుకో వెనక్కో నడిచి వెళ్లడం కాదుగదా. కాలం దూరం కాదు.” ఒక్కో చుక్కా చప్పరిస్తున్నాడతను.

కాసేపు అతనివేపే చూస్తూండిపోయాను. మేం కలిసినప్పుడల్లా ఇంతే. నేను అతన్ని చూడ్డానికి ప్రయత్నిస్తూంటాను. అతను ఎటో, ఎక్కడో, దేన్నో చూస్తూంటాడు. నేను వర్తమానంలో, అతను భూత భవిష్యత్ కాలాలతోపాటు వాటి మధ్యలో కూడా తిరుగుతూంటాడు.

నవయుగలో ఈసారి కూడా రెండో అంతస్తులో కిటికీ దగ్గరే కూచున్నాం. కాఫీ తీసుకుంటూ అడిగాను, “ఊఁ ఎలా ఉన్నావు?”

“నాకు తెలీదు. ఎప్పటిలాగే ఉన్నాను. ఉద్యోగం చేస్తున్నాను. ఇంటికొచ్చి కూచుంటాను. పూర్ణ కాఫీ చేసి ఇస్తుంది. పక్కనే కూచుంటుంది ఆమె.”

“మార్కండేయులూ, నువ్వేం చేస్తున్నావో తెలుసా? ఎంతకాలం అయింది? రెండేళ్లు దాటింది. నీకు తెలీదా? తను రాదు. వెళ్లిపోయింది. అది ఆమె జీవితం. ఎంతకాలం పోగొట్టుకుంటావు తనని?”

“నాకు తెలియడం గురించి కాదు.”

“మరేవిటి? ఏవిటిదంతా? నువ్వు కనిపించి మూడు నెలలవుతోంది. నీకు నిజం చెప్తానని భయం. పూర్ణ లేదు. ఆమె వెళ్లిపోయింది. ఆమె లేకపోవడం ఒక్కటే నిజం. నీకెన్నిసార్లు చెప్పాలి? ఆమె జీవితం ఆమెది, నీ జీవితం నీది. నీ జీవితాన్ని గాలికొదిలేశావు. దాన్ని ఎవడేనా గాలిపటంలా నీకు తెచ్చి ఇస్తాడా? ఇవన్నీ నీకు తెలీవా?”

“తెలీడం గురించి కాదు.”

“కాదా? మరి దేని గురించి?”

“పూర్ణ లేకపోవడం గురించి.”

ఇద్దరం మాట్లాడలేదు చాలాసేపు. మార్కండేయులు కిటికీలోంచి కిందికి చూస్తున్నాడు. ఎదుటి బట్టల షాపులోంచి బయటికొచ్చి పూర్ణ అతనికోసం హోటలు లాబీలోకి వస్తుంది. కిందికి చూసి చూసి అన్నాడతను, “ఒక్కసారి పూర్ణని చూడాలి.”

నాకేవనాలో తోచలేదు. మరికాసేపటి తరవాత లేచి కుర్చీ వెనక్కి తోసి అన్నాడు.

‘‘వెళ్తాను. ఫోన్ చేస్తాను.’’

క్షణంలో వెళ్లిపోయాడతను. నేను బయటికి చూసాను. కాసేపటికి రోడ్డు మీదికి వచ్చేడు మార్కండేయులు. పైకి చూడకుండా వెళ్లిపోయాడు. అతనెప్పుడూ అంతే. ఇప్పటివాడిలా ఉండడు. ఎక్కణ్నించో కాలం సాలెగూళ్లని తొలగించు కుంటూ వచ్చి నవయుగలో కలుస్తాడు. నేను వెళ్లేసరికి కిటికీ దగ్గర కూచుని ఉంటాడు. రైలు ఆగగానే దిగి కాసేపు మాట్లాడి మళ్లీ ఎక్కి వెళ్లిపోతాడు. నాలుగైదు సార్లు నేనే అతని కోసం వెళ్లేను. అతని అపార్టుమెంటు తాళం పెట్టి ఉంటుంది. ఫోను మోగదు. అతని ఆఫీసుకి వెళ్లడం నాకిష్టం ఉండదు. మొత్తానికి మార్కండేయుడి నీడ నా దరిదాపుల్లో ఎప్పుడూ ఉంటుంది.

మరో కాఫీ తాగాలనిపించింది. ఎక్కడికి వెళ్లి ఉంటాడితను? చిత్రం... అతను వెతుకుతూంటాడో తెలీదు. కోరుకుంటాడో తెలీదు. అతని జ్ఞాపకం, నా జ్ఞాపకం, పూర్ణ, పూర్ణ జ్ఞాపకాలు. ఆమె ఎక్కడుందో నాకు తెలుసు. ఏం చేస్తోందో తెలుసు. అది ఏడాదిన్నర కిందటి సంగతి. కానీ పూర్ణని కొన్ని నెలల క్రితం కలిశాను. చల్లటి ఏసీ గది.

‘‘ఏంటీ హఠాత్తుగా? నిన్ను చూసి ఎన్నో ఏళ్లైనట్టుంది. బావున్నావా?’’

‘‘బావున్నా. ఉద్యోగం బాగుంది. ఇంటరు వాళ్లకి ఫిజిక్సు చెప్తున్నాను. వాళ్లతో ఉన్నంతసేపూ హాయిగా ఉంటుంది. ఒకళ్లిద్దరు మంచి స్నేహితులు దొరికేరు.’’

‘‘మమ్మల్ని మర్చిపోయావా?’’

‘‘లేదు. అదే చెప్తున్నాను. తరచుగా, పడుకోబోయే ముందు జ్ఞాపకాలు టీవీ చూసినట్టు చూస్తాను. కొన్ని ఎపిసోడ్లు అయిపోగానే కట్టేస్తాం గదా? నిన్ను చూడ్డం అయింది. రాత్రి వెళ్లిపోతాను.’’

‘‘కొత్త ఎపిసోడ్లు.’’

‘‘అంతేగదా, కొన్ని ఎపిసోడ్లు తీసెయ్యలేం. నీకు చిన్నతనం లేదని అనుకోలేం గదా?’’

‘‘అవును, బాల్యం, యవ్వనం, ప్రేమలూ, వివాహం.’’

"విడాకులూ."

ఇద్దరం అక్కడ ఆగిపోయాం. ఆమె కాఫీ చప్పరిస్తూ జ్ఞాపకాలు చూసుకుంటోంది. నాకూ కనిపిస్తోంది. తన కనుబొమలు మృదువుగా ముడిపడ్డాయి. జ్ఞాపకాలు పడ్డ వల. ఆమె అంది.

"తను ఎలా ఉన్నాడు?"

"నీకు జ్ఞాపకం వస్తాడా?"

"ఎందుకు రాడు? జ్ఞాపకం కదా తను?"

తల ఊపి అన్నాను. "బావున్నాడని చెప్పలేను. ఎలా ఉన్నాడో తెలీదు గనక. కలుస్తూంటాం. అతని ఇష్టప్రకారం అన్నమాట. అతనెప్పుడూ నీతోనే ఉంటాడు. ఉండిపోయాడు. నువ్వతనితో ఉండడం అతనికిష్టం. ఇక్కడే మేడమీద కలుస్తాం."

"ఏవంటాడు?"

"ఏవీ అనడు. నువ్వు లేవనుకుంటాడు. నువ్వు లేకపోవడం చుట్టూ అతను జీవిస్తుంటాడు. జ్ఞాపకాలు కాదు. అతన్ని మార్చడం కష్టం. ఇంటికి రమ్మన్నా రాడు."

"అతనికి అతనితోనే సంబంధం. మూడు సంవత్సరాలు చూసాను. చాలా మంచి మనిషి."

"ఇక్కడే కలుస్తాం. పైన కిటికీ పక్కన కూచుంటాం. ఏం మాట్లాడడు. నేను మాట్లాడతాను. అతను వింటున్నట్టు కూచుంటాడు. కిటికీలోంచి రోడ్డుమీద నువ్వు కనిపిస్తావని చూస్తూంటాడు. నువ్వు లేకపోవడం అతనికి అర్థం కావడం లేదు."

"నేను కనిపిస్తే ఏం మాట్లాడతాడు."

"ఏమో."

"ఏవీ మాట్లాడ్డు. మాట్లాడ్డానికి అతనికి ఏవీ ఉండదు."

"మా తాతగారు రాజమండ్రిలో ఉండేవారు. చిన్నప్పుడు తరచూ వెళ్తూండేవాణ్ని. ఆయన తకిలీ దారం తీస్తూండేవాడు. చూస్తూంటే ఆశ్చర్యంగా ఉండేది."

"అంటే?"

"తకిలీకి దూది కండె తగిలించి గుండ్రంగా తిప్పుతూ దారం వడుకుతారు. నడుస్తూ కూడా. నీలోంచి అతనికి కావలసింది వడుకుతాడు. అతని లోకం అతను

నిర్మించుకుంటాడు. నువ్వు పట్టుపురుగులా అతనికి దూది అందిస్తే చాలు. అతనికెపుడూ కావలిసింది ఏదో, ఎక్కడో ఉంటుందనుకుంటాను. నాకూ తెలీదు. అతనెప్పుడూ నాతో వివరంగా మాట్లాడలేదు. హఠాత్తుగా నన్ను చూడాలనిపిస్తుం దంతే. వచ్చి కాఫీ తాగి వెళ్తాడు."

పూర్ణ మాట్లాడలేదు. ఖాళీ కప్పువేపు చూస్తోంది. తన చూపుల తీవ్రతతో కప్పు నిండాలని ధ్యానిస్తున్నట్టు కూచుంది.

"అతనికి జ్ఞాపకాలతో పనిలేదు. మనందరం జ్ఞాపకాలని కూడబెట్టుకుంటూ బతుకుతాం. జీవితం జ్ఞాపకాలమయం."

కాఫీ సున్నాల చుట్టూ ఈగలు వాలినట్టు. క్షణంలో మార్కండేయులు జ్ఞాపకాలు వచ్చి వాలేయి.

"ఊఁ చెప్పు," అందామె.

*

మధ్యాహ్నం ఎప్పుడో ఆఫీసులో పని ఒత్తిడిలో ఉన్నాను. ఎవరితోనో మాట్లాడుతున్నట్టున్నాను. సెల్లు మోగింది.

"నేను."

"ఆఁ చెప్పు! పోనీ తరవాత చెయ్యనా? అర్జెంటా?"

"సాయంత్రం ఇంటికి రా పనుంది."

ఫోను పెట్టేశాడు. వెంటనే పనిలో పడ్డాను. సాయంత్రం అయిదు గంటల వరకూ జారిపడ్డానికి కూడా తీరికలేకుండాపోయింది. ఇంటికి చేరి టీ తాగి కూచున్నాను. బస్సు వెనకాల పరిగెడుతూ ఇంటికొచ్చినట్టుంది. ఆరున్నరకి తేరుకొని పేపరు విప్పగానే జ్ఞాపకం వచ్చింది. ఫోన్ చేసి రమ్మన్నాడు. కొన్ని క్షణాలు భయవని పించింది. రెండు నిముషాల్లో తయారయి మార్కండేయులు ఇంటికి వెళ్లేను.

"టీ తాగుతావా?"

"ఒద్దు."

"సరే. సిగరెట్టు కాలుస్తావా?"

ఇద్దరం సిగరెట్లు వెలిగించేం. మామూలుగానే ఉన్నాడు మార్కండేయులు. పైగా రెండ్రోజుల క్రితం గడ్డం గీసుకున్నాడని తెలుస్తోంది. సిగరెట్లు కాలుతున్నాయి గానీ మార్కండేయులు మాట్లాడ్డం లేదు. సిగరెట్టు ఏష్ ట్రేలో కుక్కి అన్నాను.

‘‘ఏదో పనుందన్నావు? సిగరెట్లు కాల్చుకోడానికా?’’

నా వేపు చూసి నవ్వేడు. సిగరెట్టు ట్రేలో పడేసి అన్నాడు.

‘‘పూర్ణని పోగొట్టుకోకుండా ఉండవలిసింది.’’

‘‘ఇప్పుడదంతా ఎందుకు?’’

‘‘పూర్ణ ఇంక నాకు కనిపిస్తుందనుకోవడంలేదు. నేను సరిగా ప్రయత్నించడం లేదు.’’

‘‘అసలు ప్రయత్నం ఎందుకు? నీతో ఉండాలని ఉంటే సమస్య ఏవుంది?’’

‘‘పోగొట్టుకోవడం ఇష్టం లేదు నాకు. తనంటే ఇష్టం నాకు. నీకు తెలీదా?’’

‘‘తెలుసు.’’

‘‘నాకు రెండు మార్గాలున్నాయి. ఒకటి ఆమెని వెతికి వెళ్లి కలుసుకోవడం, రెండు... లోకం విడిచిపెట్టి వెళ్లిపోవడం.’’

‘‘సరే, పూర్ణ కనిపిస్తే ఏం మాట్లాడతావు? రమ్మని అడుగుతావా?’’

‘‘ఆమె రాదు. నాకు తెలుసు.’’

‘‘నీకు తెలీంది ఏవిటి మరి? భార్యాభర్తలుగా ఉండాలనీ, భార్యాభర్తలుగా విడిపోవాలనీ, నిరంతరం అనేకమంది ప్రయత్నిస్తూంటారు.’’

‘‘నీతో వాదించడానికి పిలవలేదు. నా నిర్ణయం చెప్పడానికి పిలిచేను.’’

‘‘ఆత్మహత్య చేసుకుంటావా? ఓకే, వద్దంటే మానేస్తావా? పూర్ణ దగ్గరికి వెళ్లకంటే మానేస్తావా?’’

‘‘నాకు బతికుండే హక్కుగానీ, అవసరంగానీ లేవనిపిస్తోంది. అందుకని...’’

అతను నావేపే చూస్తున్నాడు.

‘‘వస్తాను. పనుంది.’’ నేను లేచి వెళ్లిపోయాను.

మార్కండేయులు పిలవలేదు.

*

‘‘ఊ... మళ్లీ ఫోన్ చెయ్యలేదా?’’

‘‘లేదు. మళ్లీ ఆ విషయం రాలేదు. ఏం జరగనట్టే హోటల్లో కలిసేం.’’

‘‘అంత పని చేస్తాడా? చెయ్యలేడని నా ఉద్దేశం.’’

‘‘అవును. అదంతా నాకోసం చేసాడు. బహుశా నీ గురించి చెప్తానను కున్నాడేమో.’’

"అంతే అనుకుంటా. నన్ను కలిసినా ప్రయోజనం లేదని తెలుసతనికి. కానీ నన్ను చూడ్డం, కలిసి మాట్లాడ్డం కావాలతనికి. అతను హైదరాబాదు నడిచి వచ్చినా ఆశ్చర్యం లేదు."

రాత్రి రైలుకి వెళ్లిపోయింది తను. హోటల్లో చాలాసేపు కూచున్నాం. రాత్రి పదిన్నరవుతుండగా సెల్లు మోగింది.

"పడుకున్నావా?"

"లేదింకా."

"ఏం లేదు. రైల్లో ఉన్నా. పడుకోబోతూ నీకు ఫోన్ చెయ్యాలనిపించింది. ఏం చేస్తున్నావు? నా గురించి ఆలోచిస్తున్నావా? పాతరోజులు..."

"మీ ఇద్దరి గురించీ ఆలోచిస్తున్నాను. మీ ఇద్దర్లో ఎవరు పొరపాటు చేశారు?"

"నేనే... ఒకరకంగా అతనికి దగ్గరయి. నాకు అతని మీద కోపం లేదు."

"గుడ్ నైట్."

*

నాకు ఏవీ అర్థం కాని స్నేహితుడు మార్కండేయులు. కాలేజీ విడిచి పెట్టేశాక చాలారోజుల తరవాత కనిపించాడతను. డిగ్రీ అవగానే చెరో చోటా పీజీ చేశాం. ఇద్దరం ఒకే రైల్లో గుంటూర్లో దిగేం. నీళ్లు పీల్చుకున్న తీగెలాగ మళ్లీ మా స్నేహం అల్లుకుంది.

"మీరు పోయినా ఫరవాలేదు. మేం చూసుకుంటాం- అని చెప్తూంటాం అందరికీ," అన్నాడతను.

అతను ఎల్ఐసీ డెవలప్‌మెంటు ఆఫీసరు. ఆ తరవాత రెండేళ్లకి నా పెళ్లైంది. ఆరోజుల్లో కూడా అతనే ఫోన్ చేసేవాడు. అనేకమంది జీవితాలకి మార్కండేయులు భరోసా.

"నిశ్చింతగా పోవడానికీ, బతకడానికీ కూడా సాయం చేస్తున్నాను," అన్నాడో సారి.

"పెళ్లి చేసుకోవా మార్కండేయులూ?"

"అట్లా అనుకోవడం లేదు."

"అంటే?"

“అంటే చేసుకోవాలనే ఆలోచన లేదు. చేసుకోకూడదనే నిర్ణయమూ లేదు.”

“సరే, నీకు మంచి అమ్మాయిని చూడమంటావా.”

“మా ఆఫీసుల్నిండా వాళ్లే.”

“ఇంకేం ఎవర్నేనా చూసుకో.”

“రోజూ చూస్తూనే ఉంటా.”

రెండేళ్ల తరవాత మార్కండేయులు పెళ్లి చేసుకున్నాడు. అతనిదీ పూర్ణదీ ఎల్ఐసీ పరిచయం. జీవితాల భరోసా.

పూర్ణ కాలేజీలో పనిచేస్తూండేది. భీమా ఇద్దర్నీ కలిపింది. జీవితం విడదీసింది. ఆ మాట తనే అంది.

*

మామూలుగానే నిద్ర పట్టలేదతనికి. పక్కమీంచి లేచి బాల్కనీలో కుర్చీలో కూచుని రాత్రిని చూస్తూ కూచున్నాడు మార్కండేయులు. ఇంట్లో పూర్ణలేదు. అదే ఇల్లు. ఆమె లేకపోవడం ఆశ్చర్యం. నిన్న లేదు, క్రితం నెల, క్రితం ఏడాది, అంతకు ముందు ఏడాది- పూర్ణ లేదు. మార్కండేయుని ప్రయాణంలో రెండు మైలు రాళ్లు మిగిలేయి. ఒకటి పూర్ణ రావడం. రెండు ఆమె వెళ్లిపోవడం. రెండే అనుభవాలు. రెండు జ్ఞాపకాలు. శూన్యంలో తెల్లగా మెరుస్తున్న ఈ రెండు మైలు రాళ్ల మధ్య తచ్చాడుతూ తను. మొత్తానికి ఆమె ఎప్పటికీ లేదు. Lost Forever. పూర్ణని చూసి మాట్లాడాలి. ఎలా? ఒక్కసారి కాదు. అప్పుడప్పుడూ. తనే మాట్లాడాలని లేదు. ఆమె మాట్లాడినా సరే. అంటే- ఇద్దరం మాట్లాడకపోయినా సరే. ఈ ఇంట్లో మూడు సంవత్సరాలు, ఇంటినిండా ఉండేది. తను చోటు చేసుకొని వారగా, వెనగ్గానో చూసుకుంటూ ఉండేవాడు, ఒక మూల ఒత్తిగిలి. ఆమె రావడం, వెళ్లిపోవడం అనూహ్యంగా జరిగేయి. రెంటికీ తన ప్రమేయం లేదు. దరిదాపు రోజూ పెళ్లి ఫొటోలు చూసుకుంటాడతను. తన వస్తువులన్నీ తీసికెళ్లిపోయింది. ఈ ఆల్బమ్ ఒదిలేసింది. మర్చిపోయిందా? తనకి వస్తువులూ, గుర్తులూ ఎందుకు? ఈ ఫొటోలు తనకి అవసరం లేదు గనక ఒదిలేసింది. ఆమె ఉన్నప్పుడు చాలాసార్లు వంట తనే చేసేవాడు. ("You are a good cook Marks!") ఆమె వంట ఎలా ఉండేదో జ్ఞాపకం లేదు. ఆమెకి ఏ చీర ఇష్టమో తనకి తెలీదు. ఏదైనా బావుంటుంది తనకి. నాకిష్టమైనవి రెండే రంగులు. నవ్వేది అప్పట్లో. లోపలికి వెళ్లి సిగరెట్టు

తెచ్చుకుని వెలిగించేడు మార్కండేయులు. బాల్కనీ అవతల ప్రపంచం నిశ్శబ్దంగా ఉంది. ఉలిపిరి కాయితం వంటి నిశ్శబ్దం. రాత్రి మేలుకుని కూచోడంలో ఏదో సుఖం, ఆశ్చర్యం ఉంది.

ఒకరోజు మధ్యాహ్నం, సన్నగా నాజూగ్గా చామనచాయలో గాలి కెరటంలా తలుపు తోసుకుని వచ్చింది పూర్ణ. చల్లటి గ్లాసులో తను మంచినీళ్లు అందించాడు. పూలగుత్తిలా ఆమె కొంచెం చల్లబడింది.

"మా నాన్నగారి బెనిఫిట్స్ గురించి వచ్చేను. మీవాళ్లు ఎందుకో ఆలస్యం చేస్తున్నారు," అందామె. కాయితాలు తీసుకుని అరగంటలో ఆమె పనిచేసి పెట్టేడు. మళ్లీ కొన్ని రోజుల తరవాత వచ్చినప్పుడు భీమా చేయించాడు.

"అంటే ఇంక నాకే భయం లేదన్నమాట," అంది పూర్ణ.

"భద్రత ఉంది."

కొన్నాళ్ల పరిచయం తరవాత పూర్ణ అడిగింది.

"మీకూ మీ నాన్నగారు ఎప్పుడూ గుర్తు వస్తూంటారా, నాకులాగా?"

"నాన్నగారు కదా జ్ఞాపకం ఉంటారు. ఎవరేనా అడిగినా, గుర్తుచేసినా ఆ రోజులు గుర్తొస్తాయి. ఆయన లేరని మాత్రం జ్ఞాపకం వస్తూంటుంది."

"ఆయన జ్ఞాపకాలు మిగిలి ఉంటాయి గదా?"

"ఆయన లేరనే జ్ఞాపకం. అదే నిజం."

కొన్ని నెలల తరవాత ఒక సాయంత్రం ఫోన్ చేశాడు మార్కండేయులు.

"నేనొక పనిమీద వెళ్తున్నాను. అనుకున్నట్టు అయితే నీకు చెప్తాను," అని ఫోన్ పెట్టేశాడు.

పూర్ణ వాళ్ల పిన్నిగారింట్లో ఉంటుంది. తిన్నగా ఆమె దగ్గరికి వెళ్లి అడిగాడు మార్కండేయులు. వెంటనే కాకపోయినా, త్వరగానే పెళ్లైపోయింది.

తరవాత ఎప్పుడో మార్కండేయులు ఒక ఉదయం ఆఫీసుకి వెళ్లి సాయం కాలం తిరిగొచ్చేసరికి మూడు సంవత్సరాలైంది.

"నేను గుర్తించలేదు."

"నాకు తెలుస్తూనే ఉంది. ప్రతీరోజు," అందామె.

"మూడేళ్లు అయిందని నీకు తెలుస్తోందా?"

"తెలుస్తోంది. నీకు తెలీడం లేదని కూడా తెలుస్తోంది."

“ఏం తెలియాలంటావు నాకు?”

“అది చెప్పాలనే కూచోమన్నాను.”

అప్పుడు, ఆ తరవాత కోర్టులోగానీ మార్కండేయులికి ఏవీ అర్థం కాలేదు. ఆరోజు రాత్రి పూర్ణ రెండు గంటలపాటు మాట్లాడింది. అంటే తను అయిదారేళ్లలో అంతసేపు మాట్లాడి ఉంటాడేమో. ఆమె మాట్లాడుతున్నంతసేపూ ఆమెనే చూస్తూండిపోయాడు. పూర్ణ బాగా మాట్లాడుతుంది. చివరికి అతనికి ఒక విషయం అర్థమైంది. పూర్ణ వెళ్లిపోవాలనుకుంటోంది. కారణం ఏదయితేనేం, ఇంక ఆమె ఇంట్లో ఉండదు. ఇంక రాదు. అది నిజం. స్పష్టం.

తను లేనప్పుడు వచ్చి వస్తువులన్నీ తీసుకువెళ్లిపోయింది.

*

మొదట కొన్ని వారాలు భయపడ్డాడు. ఫేమిలీ కోర్టులో, బయటా, ఆ తరువాతా మార్కండేయులు ఏవీ మాట్లాడలేదు. కోర్టులోంచి బయటకు వచ్చి ఆవరణలో వేపచెట్టు కింద ఇద్దరం నిలబడ్డాం. ఏం చెప్పాలో నాకు తోచడం లేదు. అప్పుడప్పుడు అతని భుజం మృదువుగా నిమురుతూ మిగతా చెట్లవేపు చూస్తున్నాను. అనుకోకుండా పూర్ణ అటుగా వస్తూ కనిపించింది. అడుగులో అడుగు వేసుకుంటూ నడుస్తోందామె. మార్కండేయులు ముఖం చూశాను. అతను ఆమెనే చూస్తున్నాడు. ఆమె వెనుక నుంచి నల్లటి చిన్న కారు వచ్చి ఆగింది. ఆమె లాయరు తలుపు తీసింది. పూర్ణ వెళ్లిపోయింది. కారు గేటు దాటే వరకూ అతను చూస్తూనే ఉన్నాడు. నేనతని భుజం మీద చెయ్యి వేశాను. కారు వెళ్లగానే నా వేపు చూశాడు మార్కండేయులు. ఆ రోజునుంచీ అతను జ్ఞాపకం వచ్చినప్పుడల్లా, వేప చెట్టుకింద మెల్లిగా ముఖం నావేపు తిప్పినప్పుడు అతని కళ్ల నిండా కనిపించిన దట్టమైన ఆశ్చర్యం కనిపిస్తుంది. అతని కళ్లు చెమర్చలేదు. నమ్మశక్యం కానట్టు గేటువేపు చూశాడతను. గేటు ఇవతల తెల్ల చెక్క మీద నల్లటి అక్షరాలు-

‘బయటికి’ 'EXIT'

“ఇంటికి వెళ్దాం రా,” అన్నాను.

ఇద్దరం నడుస్తూ వెనుక కారు షెడ్డు వైపు వెళ్తున్నాం.

షెడ్డు దగ్గరికి రాగానే, “సరే, నీకు తరువాత ఫోన్ చేస్తాను,” అంటూ అతని కారు దగ్గరికి వెళ్లిపోయాడు.

వెళ్లిపోతున్న మార్కండేయులు కారు చూస్తూ నుంచుండిపోయాను. ఎక్కడో ఏదో పొరపాటు పడ్డాను. కార్లో కూచుని ఆలోచించాను. మార్కండేయులి ఆశ్చర్యం నన్ను ఇబ్బంది పెట్టింది. నాకు పూర్ణ గురించి బెంగ లేదు.

పూర్ణ ఒకసారి ఇంటికొచ్చింది కొద్ది నెలల క్రితం. చాలాసేపు మాట్లాడిందామె. నాకు పూర్తిగా అర్థమైందని చెప్పలేను. ఆమె అంది.

"ఇంకా కొన్నాళ్లు ఆగి చూడమంటావనుకున్నాను."

"మామూలుగా అయితే అంటాను. కానీ నేను మార్క్స్ గురించి ఆలోచిస్తున్నాను. అతని గురించి నాకేవీ తెలీదని అర్థమైంది. అతనెప్పుడూ ఏవీ చెప్పలేదు. కలవడం, మాట్లాడ్డం, వెళ్లిపోవడం అంతే. అందుకే కొన్నాళ్లు చూడమని చెప్పడం లేదు. ఒకటి మాత్రం చెప్పగలను. అతను నిన్ను మర్చిపోలేదు."

"నన్ను మర్చిపోవడం కాదు. నేను లేకపోవడం. నీకెవరైనా జ్ఞాపకాలంటూ లేనివాళ్లు తెలుసునా? మార్క్స్‌కి జ్ఞాపకాలు ఉండవు. అవసరం లేదు. He is a man without memories."

నాకు నోట మాట రాలేదు.

"అదెలా సాధ్యం?"

"నాకు తెలీదు."

పూర్ణ రెండు నెలల వరకూ కనిపించలేదు. ఫోన్ చెయ్యలేదు. కొత్త ఊళ్లో కొత్త ఇంట్లో అలవాటు పడే ప్రయత్నం వంటిది ఏదో చేస్తోందని తెలుసు నాకు. కొన్నాళ్లు చూసి ఉండబట్టలేక ఫోన్ చేద్దావని మెసేజి పెట్టేను. ఆ రెండు నెలల్లో ఆమె అన్నమాట మెదడులో చిన్న గంటలా మోగుతూనే ఉంది. He is a man without memories. నాకు ఎందుకు తెలీలేదు?

'నీకు ఫోన్ చేస్తానని,' మెసేజ్ పెట్టింది పూర్ణ. నేను ఊరుకున్నాను. ఒక ఉదయం లేచి చూడగానే వేసవి వచ్చి పడింది. పూర్ణని మర్చిపోలేదుగానీ నిత్యం ఎండతో పట్టే కుస్తీలో ఆమె కనిపించకపోవడం అలవాటయిపోయింది. ఒకసారి మాత్రం బలవంతంగా మార్కండేయుల్ని పిలిచి భోజనం పెట్టి పంపించాను.

"నేను రోజూ వండుకుంటాను," అన్నాడతను.

నేను నవ్వి అన్నాను, "వండుకోవని కాదు. ఒక్కడివే ఉంటున్నావనిగదా. ఇదొక నెపం."

“నేను ఎపుడూ ఒక్కణ్నే ఉంటాను. పూర్ణ ఎలా ఉంది?”

“బాగానే ఉంది. నాకూ సరిగ్గా తెలీదు.”

“ఆమె ఊళ్లోనే ఉంది.”

“నీకెలా తెలుసు?”

అతనేం మాట్లాడలేదు. కాసేపాగి అన్నాడు.

“వాళ్ల పిన్నిగారింట్లో లేదు. వేరే ఎక్కడో ఉంటోంది.”

“నాకు తెలీదు, చెప్పలేదు.”

“నేను వెతుక్కుంటాను.”

“ఎందుకు?”

భోజనం అయిన తరవాత కొంచెంసేపు కూచున్నాడు మార్కండేయులు. నేను మాట్లాడుతుంటే విన్నాడు. రాజకీయాలు, వృత్తి, స్నేహితులు, సినిమా- ఏ ఒక్కటీ అతని చేత రెండు వాక్యాలకంటే మాట్లాడించలేకపోయింది. వెళ్లడానికి లేచేడతను. గేటు దగ్గిర ఆగి ఎటో చూస్తూ అడిగేడు.

“పూర్ణని కలవడానికి ఏం చెయ్యాలి?”

“ఏమీ చెయ్యకు. ఒకరకంగా, నీకు కనిపించనంత దూరంగా ఉంది.”

“అందుకే.”

మార్కండేయులు చెయ్యి ఊపి కారు దగ్గరికి వెళ్లిపోయాడు.

వారంరోజుల తరవాత ఒక సాయంత్రం పూర్ణ ఫోన్ చేసింది.

“అరగంటలో రానా?” ఒచ్చి కాఫీ తాగుతూ కూచుంది.

“కాఫీ తాగడానికి వచ్చేవా?” నవ్వింది పూర్ణ.

“సరే ఎక్కడుంటున్నావు?”

“నా ఫ్రెండు దగ్గర. బయటికి రావడం తగ్గించాను. కాలేజీలో మానేశాను.”

“అదేవిటి? అంత రహస్య జీవితం దేనికి?”

“పిన్ని దగ్గర ఉండొచ్చుగానీ, మార్పుకోసం వెళ్లిపోయాను. నేనేం మారలేదు. చాలా రిలీఫ్ మాత్రం ఉంది. నీకు రెండు విషయాలు చెప్పాలని వచ్చేను.”

“చెప్పు.”

“తను నాకోసం వెతుకుతున్నాడు. కాలేజీ దగ్గర, పిన్నిగారింటి దగ్గిరా.”

“నిజవేఁ?”

“నిజం... నేను చూసాను. నన్ను తను చూడలేదు. ఒకసారి కాదు.”

“నీ గురించే ఆలోచిస్తున్నాడంటావా?”

“ఆలోచనలూ, జ్ఞాపకాలు కాదు. అతనికి నేను కావాలి అంతే. ఎవర్నీ అడగడు. అలా వెతుకుతూంటాడు వాసూ. అతన్ని నేను కలిసి బాధపెట్టడం ఇష్టంలేదు.”

“రెండో విషయం చెప్పు, దీనికి అంతులేదు.”

“నాకు హైదరాబాదులో ఉద్యోగం వచ్చింది. రేపు వెళ్లిపోతున్నాను. ఫోన్ చేస్తూంటాను.”

రాత్రి చాలాసేపటి వరకూ కూచుంది పూర్ణ. నేనే వెళ్లి ఆమె ఇంటి దగ్గర దిగబెట్టి వచ్చేను.

*

నేనూ, మార్కండేయులు కలుస్తూనే ఉన్నాం. నవయుగలో అద్భుతమైన ఇడ్లీ, రవ్వదోశ తింటూంటాం పల్లీ చట్నీతో.

“నువ్వు ఇంటికి రావడం మానేశావు,” అన్నాను.

“ఏవీ అనుకోకు. రావాలనిపించలేదు.”

“అనిపించకపోయినా రావాలి. కబుర్లు చెప్పుకుంటే బావుంటుంది. నువ్వు బాగున్నావని తెలుస్తుంది. నీకూ నాకూ కూడా రిలీఫు. ఒక్కడివే కూచుని ఏవాలోచిస్తూంటావు?”

“ఆలోచించను వాసూ. మిస్ అవుతూంటాను. పూర్ణ విజయవాడలో ఉందని తెలిసింది.”

“ఎవరు చెప్పేరూ?”

“తెలిసింది. పొరపాటు కావొచ్చు. నీకు తెలుసని నాకు తెలుసు. నిన్ను అడగను.”

“నాకు తెలీదు. ఫోన్ చేస్తూంటుంది ఎప్పుడేనా. ఎక్కడుందో అడగొద్దని మాట తీసుకుంది. తన మనసుకి నచ్చిన సుఖం, జీవితం కావాలి ఆమెకి. అందులో పూర్ణకి స్వార్థం లేదు.”

“నిన్నిందులోకి లాగడం నాకిష్టంలేదు. నేనే తెలుసుకుంటాను. ఒక రకంగా ఆమెని అన్వేషించడం, కలుసుకోవడం నా గమ్యం.”

“కాదనుకుంటాను. నీ గమ్యం అదికాదు. ఆలోచించు.”

ఇద్దరం కాఫీ తాగుతూ, నేను పూర్ణ గురించీ, అతను గమ్యం గురించీ ఆలోచనలో పడ్డాం. పూర్ణని చూసి చాలా రోజులైంది. ఒకసారి వస్తే బాగుండును. కాసేపైన తరవాత లేచేడతను. అతను వెళ్లిన చాలాసేపటి వరకూ అలాగే కూచుండి పోయాను.

నేను మామూలుగా జీవితంతో తిరుగుతున్నాను. కొన్ని స్థిరకక్ష్యల చుట్టూ, ఇష్టంగా, తప్పకా, కొంత చిరాగ్గా, ఎక్కువ భాగం మామూలుగా. దీనికి ఎప్పుడేనా అంతరాయం కలుగుతూంటుంది- పూర్ణ ఫోను చేసినప్పుడు. జోగుతూ కుర్చీలోంచి కిందపడ్డట్టు. ఆమె ఫోన్‌కాల్ చేసినప్పుడల్లా జీవితంలోంచి జారి కింద పడు తుంటాను.

నా జీవితంలో వచ్చిన మార్పులలో ఒకటి నవయుగ రామయ్య చౌదరి గారికి గుండె ఆగిపోయింది. అన్ని కార్యక్రమాలూ అయిన తరువాత ఎప్పుడో మళ్లీ హోటలు తెరిచారు. తెరిచిన కొన్ని రోజుల తరువాత నేనూ, మార్కండేయులూ రెండో అంతస్తు కిటికీ పక్కన కూచున్నాము. టేబిలు, గోడలూ, రంగులూ అన్నీ మారిపోయాయి. మార్పు వాసన తెలుస్తోంది. సర్వరు నీలం పేంటు చొక్కాలో వచ్చి నుంచున్నాడు. ఇడ్లీ రుచిగా లేదు. పల్లి చెట్నీ బదులు శనగ చట్నీ. స్థిరంగా కనిపించే మార్పు.

“చూశావా, ఎంత మారిపోయిందో?”

“అంతే గదా.”

“ఇడ్లీ ఎలా ఉంది?”

“ఏదో తేడా ఉంది.”

“ఏవిటి సంగతులు?”

“ఏవుంటాయి? నేను హైదరాబాదు వెళ్లిపోవాలనుకుంటున్నాను. అడిగేను, ఏవవుతుందో తెలీదు.”

“ఏం ఇక్కడ బాగులేదా?”

“ఎప్పటిలాగే ఉంది.”

తరవాత నవయుగ మొహం చూడలేదు. మార్కండేయులు కనిపించి ఏడాది అవుతోంది. మధ్యలో ఒకసారి ఫోన్ చేసినా సమాధానం లేదు. అతనుంటే

కాలం స్తంభించినట్టుంటుంది. జ్ఞాపకాలు చిత్రమైనవి. కానీ నా పద్ధతి నాకే నచ్చ లేదు. ఆఫీసుకి వెళ్లి పలకరించక తప్పదు. అనుకోగానే ఎన్నో జ్ఞాపకాలు- తలుపు తీసుకుని ఇంట్లోకి ఎవరెవరో వచ్చినట్టు. కాలింగ్ బెల్లు మోగింది. తలుపు తీయ గానే ఎదురుగా నుంచుని, "హలో," అన్నాడు మార్కండేయులు.

అతన్ని చూడ్డం సంతోషంగా ఉంది. అదే అన్నాను. నవ్వేడు.

"నీకోమాట చెప్పాలని ఒచ్చేను. ఒకటి కాదు రెండు."

"చెప్పు."

ఇద్దరం టీ చప్పరిస్తున్నాం. చటుక్కున ఆగి అన్నాడు.

"నాకు విజయవాడ వేశారు. వెళ్తున్నాను... రెండు, పూర్ణ హైదరాబాదులో ఉంది. పూర్ణ పిన్నిగారు కొడుకు దగ్గిరికి విజయవాడ వెళ్లిపోయారు. ఆవిడకి బాగుండడంలేదు."

"నాకు తెలీదు."

"నేను తెలుసుకున్నాను."

చాలాసేపు కూచున్నాడు. నేను మాట్లాడుతుంటే విన్నాడు. గేటు వరకూ వెళ్లి అన్నాను, "కనీసం ఫోను చేస్తూండు లేదా ఫోను చేస్తే తీసుకో."

తల ఊపి వెళ్లిపోయాడు మార్కండేయులు. ఇది మరో కొనసాగింపు. పూర్ణ గురించి ఎలా తెలుసుకున్నాడు? పూర్ణని ఎలా కలుసుకుంటాడు? అతని మూడు సంవత్సరాల వైవాహిక జీవితానికి సంబంధించిన జ్ఞాపకాలు ఎప్పుడూ ఒక్కసారి కూడా చెప్పలేదు. పెళ్లైన కొన్ని నెలల తరవాత ఇద్దరూ శ్రీలంక వెళ్లి వచ్చేరు. వెళ్లేప్పుడు వెళ్తున్నాం అని, వచ్చిన తరవాత వచ్చేమనీ చెప్పేడు మార్కండేయులు.

పూర్ణకి ఫోన్ చేశాను.

"ఈ మధ్య ఫోను లేదేం?"

"ఏవీలేదు. నువ్వక్కడున్నావని మార్కండేయులికి తెలిసింది. ఇందాక వచ్చి చెప్పేడు."

పూర్ణ నవ్వి అంది.

"ఈ మహానగరంలో ఎక్కడని చూస్తాడు? అక్కడే ఉంటున్నాడా?"

‘‘లేదు, విజయవాడ. పిన్నిగారున్నారట కదా అక్కడికి.’’

‘‘అవును. ఆవిణ్ణి చూడ్డానికి వస్తే నన్ను కలవాలని అతని ఉద్దేశం. అతను అలాగే ఉంటాడు. అతనికి ఒకే ఒక వ్యాపకం వాసూ, నేను లేకపోవడం.’’

‘‘పూర్ణా ఇదివరకే చెప్పాలనుకున్నాను. ఎందుకో కుదరలేదు.’’

‘‘నువ్వేం చెప్పాలనుకుంటూన్నావో నాకు తెలుసు వాసూ. నాకా ఆలోచన లేదు, ఇష్టం లేదు. అవసరం కూడా లేదూ. అయినా ఎన్నిసార్లు చేసుకోమంటావు? మార్కృ కోసమా? మేం రెండు ధృవాలం. నేను మళ్లీ చేసుకుంటే ఆ మధ్య దూరం పెరగదు. పైగా మార్కృ నాకు సమస్య కాదు.’’

‘‘నీకిష్టం లేనప్పుడు చెప్పేదేంలేదు.’’

‘‘నా గురించిగానీ మార్కృ గురించిగానీ బెంగపడకు. నాకవసరం అయినప్పుడు నిన్నే అడుగుతాను. మార్కృకి నీ అవసరం లేదు. ఉండదు. నువ్వనుకుంటున్నట్టు అతను నాకోసం, నా క్షేమం కోసం బెంగపడ్డు. లేనితనం అనే శూన్యంలో ఉంటాడు. నీకూ చాలాసార్లు చెప్పేను గదా.’’

*

తరవాత ఒకరోజు మార్కండేయులు కలలో కనిపించాడు. నాకిప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది. రాత్రంతా అదే కల. ఉదయం లేవగానే ఏదోగా అనిపించింది. నేను అతనితో మాట్లాడి అప్పటికి రెండు సంవత్సరాలైంది. ఈలోగా నన్ను మళ్లీ విశాఖపట్నం బదిలీ చేసారు... చిత్రమైన కల. రోజంతా కళ్లలో ఉండిపోయింది... రైలు చాలా వేగంగా అరుచుకుంటూ వెళ్తోంది. రాత్రి కిటికీ దగ్గర కూచుని మార్కండేయులు చీకట్లోకి చూస్తున్నాడు. రైలెక్కడో ఆగింది. స్టేషన్లో అతను తప్ప ఎవ్వరూ లేరు. బేగు లాక్కుంటూ గబగబా అవతలి ప్లాట్‌ఫాం మీద ఉన్న రైలెక్కేడతను. రైలు వేగం పీల్చుకుంటూ అతను వచ్చినవేపే వెళ్తోంది. కిటికీ పక్కనే కూచుని కాఫీ తాగుతూ గుండ్రంగా తిరిగే లోకాన్ని చూస్తున్నాడతను... ఈసారి ఉదయం మార్కృ కదిలిపోతున్న రైలెక్కేడు. కిటికీ పక్కనే కళ్లు మూసుకుని కూర్చున్నాడు. రైలు ఎక్కడో ఆగింది. మార్కండేయులు దిగుతూ, కాలు జారి ప్లాట్‌ఫాం మీద పడ్డాడు...

ఉలిక్కిపడి లేచేను.

ఇంట్లోంచి, ఆఫీసునుంచీ మార్కండేయులికి ఫోన్లు చేశాను. మర్నాడు సాయంకాలానికి నేను మర్చిపోయాను. దరిదాపు అయిదోరోజు సాయంకాలం ఫోను వార్త పంపించింది పూర్ణ.

"మార్కు నిన్న ఉదయం నాంపల్లి స్టేషన్‌లో వెయిటింగ్ రూమ్‌లో పోయాడని తెలిసింది. రాత్రి నీకు ఫోన్ చేస్తాను."

లోకంలో అన్ని శబ్దాలూ ఆగిపోయాయి.


తరవాత చాలా రోజులకి హఠాత్తుగా నాకు రెండు చిన్న పెద్ద విషయాలు అర్థమైనాయి.

మార్కండేయులు ఎలా ఉండాలనుకున్నాడో అలాగే ఉన్నాడు.

పూర్ణ ఎలా ఉండకూడదనుకున్నదో అలాగే ఉంది.

*'సమాంతరాలు' కథాసంపుటి*
*ఆగస్ట్ 2021*

*



**తల్లావజ్ఝల పతంజలి శాస్త్రి** 14 మే 1945న తూర్పు గోదావరి జిల్లాలో జన్మించారు. వీరి మొదటి కథ సీతన్న తాట 1962లో ఆంధ్రప్రభలో అచ్చయింది. ఏడు కథాసంపుటాలు- వడ్లచిలకలు, పతంజలిశాస్త్రి కథలు, నలుపెరుపు, రామేశ్వరం కాకులు, సమాంతరాలు, జెన్, *గుప్తా 91*, నాలుగు నవలలు, నాలుగు నాటకాలు, భమిడిపాటి కామేశ్వరరావుగారి సంక్షిప్త జీవితచరిత్ర, ఒక కవితా సంపుటి ప్రచురించారు. ఆర్కియాలజీ చదివి, పర్యావరణ కార్యకర్తగా స్థిరపడి ప్రస్తుతం ఎన్విరాన్‌మెంట్ సెంటర్ అధ్యక్షులుగా ఉన్నారు.

***చిరునామా: 86-4-16/1, వాడ్రేవునగర్, రాజమండ్రి - 533003, తూ.గో. జిల్లా***
***ఫోన్: 94407 03440        Email: ec_india@yahoo.com***